గురజాలలో ఎన్నికల వేడి..

- సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- బదిలీపై వచ్చిన పలువురు అధికారులు
- విస్తృత తనిఖీల్లో పోలీసు అధికారులు
- మహిళ ఓటర్లను ప్రసన్నం చేసుకున్న వారిదే విజయం
- నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళలు 6,973 మంది అధికం



పలు రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ

గురజాల : పల్నాడులో సార్వత్రిక ఎన్నికల హీట్ మొదలైంది. గురజాల శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లను అధికారులు త్వరితగతిన పూర్తిచేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖల్లో హడావుడి కనిపిస్తోంది. మండల కేంద్రాల్లో మూడు సంవత్సరాలకు పైబడి విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. ఓటరు జాబితాలపై పలుమార్లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో రిట్నరింగ్ అధికారి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించే పనిలో రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల తహసీల్దార్లు, కమిషనర్, పోలీస్ శాఖ అధికారులు కూడా బదిలీ అయ్యారు. వివిధ రాజకీయ పార్టీల్లో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం కనిపిస్తుండటంతో.. ఇప్పటికే పలు రాజకీయ పార్టీ నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పలు కుల సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

మహిళా ఓటర్లే కీలకం..

గురజాల నియోజకవర్గంలో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 6,973 మంది అధికంగా ఉన్నారు. రాజకీయ పార్టీలు ఇప్పుడు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. ఎన్నికల కమిషన్ ఓటరు తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,71,277 మంది కాగా, వారిలో 1,32,131 మంది పురుషులు, 1,39,104 మంది మహిళలు ఉన్నారు. గురజాల నుంచి అసెంబ్లీకి పోవాలంటే.. ఆమె ఓటు నిర్ణయాత్మకం కానుంది.

గురజాలలో ఓటర్లు వివరాలు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
గురజాల రూరల్	16,620	17,325	2	33,947
గురజాల పట్టణం	10,652	11,811	3	22,466
దాచేపల్లి రూరల్	16,803	17,233	1	34,037
దాచేపల్లి పట్టణం	15,403	16,297	12	31,712
మాచవరం	21,302	21,782	4	43,088
పిడుగురాళ్ల రూరల్	25,343	26,516	5	51,864
పిడుగురాళ్ల పట్టణం	26,008	28,140	15	54,163
మొత్తం	1,32,131	1,39,104	42	2,71,277

నిఘా ముమ్మరం



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేశాం. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన నాగార్జున సాగర్, తంగెడ, పొందుగుల వద్ద 24 గంటల పాటు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నాం. ఎటువంటి ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో మద్యం, నగదు తరలిస్తూ.. పట్టుబడితే.. సీజ్ చేయడం జరుగుతుంది. ఈ ప్రాంతాల్లో నిత్యం ఎక్సైజ్, ఇన్‌కమ్ ట్యాక్స్, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు చెకింగ్ చేస్తూనే ఉన్నారు.

– పల్లపురాజు, డీఎస్పీ, గురజాల

ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2023–24 రబీబీబీ సీజన్‌కు సంబంధించి చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతంగా ఫిబ్రవరి 15 నాటికి 100 శాతం పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రెంటాల, పశర్లపాడు, జెట్టిపాలెం, మిట్టగుడిపాడు, మల్లవరం, గోలి, తదితర గ్రామాలలో ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో రబీ సీజన్‌లో మొత్తం సాగు భూమి 4,177 ఎకరాలలో వరి 1,862 ఎకరాలు, శనగ 1,584, మొక్కజొన్న 487 ఎకరాలు మిగిలిన 244 ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేసారన్నారు. గ్రామాలలో వీర్వోలతో కలసి వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఎంపీఈవోలు పంట పొలాలను సందర్శించి ఇప్పటి వరకు 3,759 ఎకరాలకు సంబంధించి 95 శాతం ఈ క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందన్నారు. 83 శాతం రైతులకు ఈ కేవైసీ కూడా చేయించినట్లు తెలిపారు. మరో 17 శాతం రైతులకు ఈ కేవైసీ చేయాల్సిందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు వీఆర్వోలు సంయుక్తంగా ఈ క్రాప్ బుకింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రాప్ బుకింగ్, ఈ కేవైసీ చేయించుకోవడం వలన రైతులు, కౌలు రైతులు కూడా పంటలు నష్టపోయినప్పుడు, పంటలను గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవడం వంటి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. వీఆర్వోలు, వీఏఏలు, వ్యవసాయ, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

క్లుప్తంగా

భద్రతతో కూడిన ప్రయాణం క్షేమం



దాచేపల్లి : భద్రతతో కూడిన ప్రయాణం క్షేమకరమని సీఐ ఎ.సురేంద్రబాబు అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు దాచేపల్లిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో భద్రత చర్యలు చేపట్టాలని, భద్రత లేకుండా ప్రయాణం చేసి ప్రమాదాలబారిన పడవద్దని చెప్పారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే సమయాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి, ఏఎస్ఐ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల, లైమ్ సిటీ, శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. ఈ శిబిరానికి సుమారు 350 మంది హాజరయ్యారు. వారిలో 200 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరముందని, వీరందరికి శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని వారిచే ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి కన్వీనర్లుగా గర్నె సుబ్రహ్మణ్యం, కాకుమాను శ్రీనివాసరావులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షులు ఎ.గురవయ్య, సెక్రటరీ కొత్త రవి, ట్రెజరర్ జె.బ్రహ్మం, రోటరీ సీనియర్ సభ్యులు తాటా సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, జూలకంటి సుబ్రహ్మణ్యం, గుండా అశోక్, ఏచూరి రాధాకృష్ణ, పీవీ నరసింహారావు, అమీర్ అలీ, వైద్యులు హాజరయ్యారు.

కొండవీడును సందర్శించిన విద్యార్థులు



పిడుగురాళ్ల: విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర విజయవంతంగా జరిగిందని పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.స్వామి తెలిపారు. పాఠశాలలోని 4, 5 తరగతులు చదువుతున్న 30 మంది విద్యార్థులతో పల్నాడు జిల్లాలోని చారిత్రక కొండవీడు ప్రదేశాన్ని సందర్శించి కొండవీడు అందాలను తిలకించి ఆటపాటలతో విద్యార్థులు గడిపారని తెలిపారు. విద్యార్థులకు కొండవీడు ప్రాముఖ్యత గురించి వివరించటం జరిగిందన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రామకృష్ణ విద్యార్థులకు రవాణా, భోజన సదుపాయాలను కల్పించటం అభినందనీయమన్నారు. విజ్ఞాన విహార యాత్రలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్య సహాయ మాత వేడుకలు



మాచర్ల: పట్టణంలోని లక్షల రూపాయలతో నిర్మించిన నిత్య సహాయ మాత దేవాలయ ప్రతిష్ఠ, 58వ మహోత్సవాల సందర్భంగా ఆదివారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని రెవ. ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి నిర్వహించారు. అందులో భాగంగా ముందుగా పవిత్ర దివ్య పూజాబలి, వాక్యోపదేశము నిత్య సహాయ మహోత్సవ కార్యక్రమాన్ని జరిపి పతాక ఆవిష్కరణ జరిపారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.సుందరరాజు, జె.మర్రెడ్డి, కిరీటిరెడ్డి, ఎ.ప్రకాష్, తుమ్మా మర్రెడ్డి, లక్ష్మయ్యతో పాటు సెయింటాన్స్ సంస్థలకు చెందిన హెచ్‌ఎంలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

రాజుపాలెం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నేడు వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం సునీత ఆదివారం తెలిపారు. మండలంలో 722 డ్వాక్రా గ్రూపులకు గాను రూ.5.69 కోట్లు జమచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతున్నట్లు తెలిపారు. కావున అర్హులైన డ్వాక్రా సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

రెంటచింతలలో దాడికి నిరసనగా ర్యాలీ



రెంటచింతలలో నల్లబ్యాడ్జీలను ధరించి శాంతి యుత ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతలలో ఆదివారం కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు నల్లబ్యాడ్జిలను ధరించి శాంతి యుత భారీ ర్యాలీని చర్చి వద్ద నుంచి పురవీధులలో నిర్వహించారు. ఈనెల 2న కానుకమాత చర్చి తిరునాళ్లలో జరిగిన ఘటన, 4న ఓరుగంటి ఇన్నారెడ్డి, వి.విజయభాస్కర్‌రెడ్డి అనే యువకులపై కొందరు రెంటాల గ్రామ యువకులు మూకుమ్మడి దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచి కంప్యూటర్లు ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో చర్చి విచారణ గురువులు ఫాదర్ వై ఎల్ మర్రెడ్డి, చర్చి పెద్దలు, సంఘ పెద్దలు కలిసి కానుకమాత చర్చి ప్రాంగణంలో భౌతిక దాడులు నిరోధించాలని కోరుతూ పురవీధులలో శాంతియుత ర్యాలీ నిర్వహించి చర్చి ముందు బాధితులతో కలసి కొంతసేపు మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ వై ఎల్ మర్రెడ్డి మాట్లాడుతూ 174 సంవత్సరాల చరిత్ర కలిగిన కానుకమాత చర్చి ఆవరణలో ఎప్పుడూ ఇటువంటి ఘటనలు జరగలేదన్నారు. బాధితులకు న్యాయం చేయాలని, పవిత్రమైన చర్చి ఆవరణలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కానుకమాత చర్చి పెద్దలు, క్రైస్తవ సంఘ పెద్దలు, కథోలికులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

మాచర్ల: ఆర్యవైశ్యుల ఇలవేల్పు, ఆదిపరాశక్తి శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల కోసం ఆత్మార్పణ చేసిన రోజు శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధ్యక్షులు ఆత్మకూరి పూర్ణచంద్రరావు, అర్చకులు శ్రీనివాసశర్మ, దత్తుల ఆధ్వర్యంలో ఘనంగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 102 గోత్రాల కన్యలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ప్రధాన రహదారిలోని కోదండ రామాలయం నుంచి 102 బిందెలతో అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. అనంతరం దేవాలయంలో పూజలు చేశారు. ఆర్యవైశ్య పెద్దలు, కమిటీ సభ్యులు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో పలువురు చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడా వెంకట లక్ష్మి, సెక్రటరీ చుండూరు సత్యనారాయణ, వాసవి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కంభంపాటి అనిల్‌కుమార్, భవనారి వెంకటేశ్వర్లు, పరిటాల ధనలక్ష్మి, తిరివీధి శిరీష పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

అమరావతి: దేశంలో కార్మిక హక్కులు కాలరాస్తూ, రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు రైతాంగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహిస్తున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి 200 రోజులకు పని దినాలు పెంచి ప్రతి కూలీకి రోజు 600 రూపాయలు వేతనం ఇవ్వాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లులను ఉపసంహరించాలని స్మార్ట్ మీటర్ల బిగింపును నిలిపివేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇచ్చి ప్రాజెక్టు వల్ల నష్టపోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతాంగ ప్రయోజనాల అనుగుణంగా సమగ్ర పంట బీమా పథకాన్ని అమలు చేసి రైతాంగ హక్కుల పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుతో అన్ని పంటలకు మద్దతు ధర చట్టం చేసి రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలన్నారు. యువజన కాంగ్రెస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు గంటా గోపి, ఏఐటీయూసీ నాయకులు అగస్టీన్ సీపీఐ మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, నాయకులు కె.యేసు, సీఐటీయూ నాయకులు నజీర్ మహమ్మద్ రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నండూరి వెంకటేశ్వరరాజు రత్నబాబు ఉదయ శంకర్‌లు మాట్లాడారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



చిలకలూరిపేట: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న జ్వాలాముఖి పోలేరమ్మ తల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు పాల్గొన్నారు.

పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి ఘన నివాళి



నరసరావుపేట ఈస్ట్: జన సంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన పండిట్ దీన్ దయాళ్ పుణ్యతిథిని పురస్కరించుకొని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బరంపేటలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సమర్పణ దివస్ నిర్వహించారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ, పార్లమెంట్ సంయోజక్ చిరుమామిళ్ల ఆదినారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి కామినేని హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు వీరమల్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



విజయపురిసౌత్: రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్ అన్నారు. ఆదివారం రాత్రి మాచర్ల మండలం పసువేముల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పండ్ల మంగయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో భద్రత సూచికలు పాటించాలని, లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి యుతంగా మెలగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అనంతరం 50 హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయపురి సౌత్ ఎస్ఐ డి.వెంకట కొండారెడ్డి, గ్రామస్తులు నారాయణ, అంజయ్య, సత్యనారాయణ, నాసరయ్య, పుల్లయ్య, సర్పంచ్ దేవదానం, కర్ర చిన రంగయ్య పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో నగర సంకీర్తన



సత్తెనపల్లి: పట్టణంలోని నాలుగు బజార్లలో నగర సంకీర్తన బృందం ఆదివారం పర్యటించింది. దేవుడి ఫొటోను చేత పట్టుకొని కోలాట ప్రదర్శనగా పట్టణంలోని గీతా మందిరం నుంచి ఉదయం ఐదు గంటలకు బేడ బుడగ జంగాల కాలనీకి వెళ్లి అక్కడ లక్ష్మీతిరుపతమ్మ గుడి దగ్గర, అక్కడి నుంచి నాలుగు బజార్లు నగర సంకీర్తన చేశారు. ఈ బృందంలో 51 మంది సభ్యులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు దుస్తులు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరు పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం అందజేశారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేసి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, రామ్మోహనాచార్యులు, నారాయణ, ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చాకలికుంట తండాలో ఉచిత వైద్య శిబిరం



రొంపిచర్ల : కొత్తపల్లి గ్రామంలో ఆదివారం నరసరావుపేటకు చెందిన మ్యాక్స్‌కేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ యనమదల శివప్రదీప్, డాక్టర్ యనమదల శ్రీ హర్ష పాల్గొని వైద్యసేవలు అందించారు. గ్రామానికి చెందిన 300 మందికి జ్వరం, జలుబు, దగ్గు, బీపీ, షుగర్ వంటి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బికారి నాయక్, ఎంపీటీసీ సోమ్లా నాయక్, ఉప సర్పంచ్ నరసింహా నాయక్, ఆర్‌ఎంపీ వైద్యులు కొడావత్ నరసింహా నాయక్ పాల్గొన్నారు.

నేడు క్రీస్తు లూథరన్ దేవాలయం ప్రతిష్ఠ



లూథరన్ దేవాలయం

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో క్రీస్తు లూథరన్ దేవాలయం ప్రతిష్ఠకు ముస్తాబైంది. ఎస్సీ కాలనీలో నిర్మించిన ఈ దేవాలయంను సోమవారం ప్రతిష్ఠించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా 15 వేల మందికి అన్నదానం చేసేలా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నడికుడి క్రీస్తు లూథరన్ దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవంలో గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు. ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఏఈఎల్‌సీ నాయకులు పాల్గొంటారు.



చర్చి పెద్దలకు విరాళం అందజేస్తున్న దృశ్యం

చర్చి ప్రతిష్ఠకు రూ2.60 లక్షలు విరాళం అందజేత

నగర పంచాయతీ పరిధిలో నడికుడిలో క్రీస్తు లూథరన్ చర్చి ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రూ.2.60 లక్షల విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని మాజీ సంఘ పెద్దలు, చర్చి కమిటీ సభ్యులకు ఆదివారం చర్చిలో సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి అందజేశారు. చర్చి ప్రతిష్ఠకు ఎమ్మెల్యే కాసు తో పాటు తాము అండగా ఉంటామని రమేష్‌రెడ్డి చెప్పారు. విరాళం అందజేసిన ఎమ్మెల్యే కాసు కి సంఘస్థులు, కమిటీ సభ్యులు కృతజ్ఞత లు తెలిపారు. క మాజీ సర్పంచ్ బు ర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వల్లపు హనుమంతరావు, సైదుజాను, వర్రా వెంకటరెడ్డి, ఐనాల శ్రీరాములు, సుబ్బారెడ్డి, శివారెడ్డి, అబ్దుల్లా, వలి, హస్సన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ భవనం, కమిటీ సభ్యులు



వేలాది మంది భక్తుల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నకరికల్లు: స్థానిక అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం కన్నుల పండుగగా జరిగింది. గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగ ణం మారు మోగింది. వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. స్వామివారికి విశేష ద్రవ్యాల తో అభిషేకాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పలు పార్టీల నాయకులు ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రథమ అర్చకులు తుంగతుర్తి కృష్ణమూర్తిశాస్త్రి ఆధ్వర్యంలో దాతలను, పండితులను ఘనంగా సత్కరించా రు. చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

దాడి ఘటనలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: దాడి ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. అర్బన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని సుగాలి కాలనీకి చెందిన సురేష్ నాయక్ (40) బావమరిది రవితేజా, స్నేహితులు వేణు, భీమా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్‌తో కలసి పట్టణంలోని సింగ్‌నగర్ ప్రభుత్వ వైన్స్ వద్ద మద్యం సేవించటానికి వెళ్లారు. పాత కక్షల నేపథ్యంలో వెంకటేశ్వర్లు నాయక్ నాపరాయితో సురేష్ నాయక్ తలపై కొట్టాడు. ఈ దాడిలో సురేష్ నాయక్‌కు గాయాలయ్యి స్పృహ కోల్పోయాడు. స్నేహితుల సహాయంతో భార్య శ్రావణిబాయి సురేష్‌నాయక్‌ను పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సురేష్‌నాయక్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.